సాక్షి
ఖమ్మం
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



ముగిసిన పోటీలు

జీళ్లచెరువులో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్లపందేలు, మహిళల ప్రొ కబడ్డీ పోటీలు ముగిశాయి. 8లో




కళ్లారా చూడొచ్చు.. ఎదగొచ్చు!

ఇస్రోలో శిక్షణ కోసం ఆసక్తి ఉన్న 9వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు సోమవారం ముగియనుంది. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 24°

వాతావరణం

ఆదివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగానే నమోదవుతాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.



ఇక బలమైన బియ్యం!

ఫోర్టిఫైడ్ రేషన్ పంపిణీకి ఏర్పాట్లు

- జిల్లా రేషన్ షాపుల్లో ఈనెల 5నుంచి సరఫరా
- పోషకాహార లోపం తగ్గించేందుకు నిర్ణయం
- రెండో విడతలో జిల్లాను ఎంపిక చేసిన ప్రభుత్వం

జిల్లాలోని రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల వివరాలు

కార్డు	సంఖ్య	లబ్ధిదారులు	బియ్యం (కిలోల్లో)
అంత్యోదయ	26,794	71,133	9,37,790
ఆహారభద్రత	3,85,295	10,66,464	53,32,320
అన్నపూర్ణ	3	5	150
మొత్తం	4,12,092	11,37,602	62,70,260



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు ఇక నుంచి ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేయనుంది. అత్యంత పోషక విలువలు ఉన్న ఫోర్టిఫైడ్ రైస్(బలవర్ధకమైన బియ్యం) పంపిణీతో పోషకాహార లోపాలు అరికట్టవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కేంద్రప్రభుత్వం కొన్ని జిల్లాల్లో ఈ బియ్యం పంపిణీ చేస్తుండగా, రెండో విడతలో జిల్లాను ఎంపిక చేశారు. ఈనెల 5 నుంచి జిల్లాలోని 745 రేషన్ దుకాణాల్లో సాధారణ బియ్యంలో ఈ బియ్యం కలిపి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. ఇందుకోసం పౌర సరఫరాల సంస్థ ఉద్యోగులు, ఎఫ్‌సీఐకి బియ్యం ఇచ్చే మిల్లర్లకు అవగాహన కల్పించారు.

పోషకాహార భద్రత దిశగా...

ఆహార భద్రత సుస్థిరమవుతున్న దశలో పౌష్టికాహార లోపం కూడా ఉండొద్దనే లక్ష్యంతో బలవర్ధకమైన ఆహారాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని జిల్లాల్లో అమలు చేయగా విజయం సాధించడంతో రెండో విడతలో అమలు కోసం జిల్లాను ఎంపిక చేశారు. ప్రస్తుతం పోషకాహార లోపంతో అనేకమంది బాధపడుతుండగా.. వీరిలో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. సాధారణంగా బియ్యాన్ని పాలిష్ చేసే సమయంలో అందులో ఉండే ఖనిజాలు, పోషకాలు తగ్గిపోతాయి. దీనిని నివారించేందుకు ఆ బియ్యానికి బదులుగా విటమిన్లు, ఖనిజాలు, పోషకాలతో కూడిన ఎఫ్ఆర్‌కే బియ్యం అందజేస్తారు.

ఇప్పటికే పాఠశాలలు, అంగన్‌వాడీల్లో...

గతంలోనే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనానికి ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్నారు. ఇక నుంచి రేషన్ దుకాణాల్లోనూ ఈ బియ్యం అందనున్నాయి. ప్రతీ కిలో బియ్యానికి వివిధ పోషకాలను ఫుడ్ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆమోదించిన మోతాదులో విటమిన్లు, ఖనిజాలు కలుపుతారు. ఐరన్(ఫెర్రిక్ పైరో ఫాస్ఫేట్) 28 మిల్లీగ్రాముల నుంచి 42.5 మిల్లీగ్రాముల వరకు కలుపుతారు. లేదా సోడియం ఐరన్(సోడియం ఫెరెడిటేట్) 14 మిల్లీగ్రాముల నుంచి 21.25 మిల్లీగ్రాముల వరకు కలుపుతారు. ఫోలిక్ యాసిడ్‌ను 75 మిల్లీగ్రాముల నుంచి 125 మిల్లీగ్రాములు, విటమిన్ బీ–12 కోసం క్యానోకోబాల్మైన్ లేదా హైడ్రాక్సికోబాల్మైన్ అంతే మొత్తంలో కలిపేవే ఫోర్టిఫైడ్ రైస్. వీటికి అదనంగా విటమిన్–ఏ, థయామిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్‌తో పాటు విటమిన్ బీ 6 పోషకాలు కూడా ఈ ఫోర్టిఫైడ్ రైస్‌లో ఉంటాయి.

ఫోర్టిఫైడ్‌తో లాభాలివే..

ఫోర్టిఫైడ్ బియ్యం వల్ల అనేక లాభాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. అందులో ఉండే ఐరన్‌తో రక్తహీనత నుంచి రక్షణ లభిస్తుందని, శరీరంలో అలసట తగ్గి చలాకీతనం పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే, నెలలు నిండకుండా ప్రసవించడం, బరువు తక్కువ శిశువు జన్మించడం వంటి సమస్యలు తలెత్తవు. ఇక ఫోలిక్ యాసిడ్ శరీరంలో తగిన మోతాదులో రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది. గర్భస్థ దశలో నరాల బలహీనత వల్ల పుట్టే బిడ్డల్లో, పుట్టుకతో వచ్చే రుగ్మతల నుంచి రక్షణ లభిస్తుంది. విటమిన్ బీ–12 మెదడు, నాడీ వ్యవస్థను సక్రమంగా పనిచేయించడంలో సహకరిస్తుందని, శరీరంలో రక్తం తయారు కావడానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు.

ఫోర్టిఫైడ్ రైస్ అంటే..



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలిపి ఈ బియ్యం సిద్ధం చేస్తారు. బియ్యం, ఇతర ఆహార ధాన్యాల్లో ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని కేంద్రం భావిస్తోంది. బియ్యాన్ని పిండిగా మార్చి దానికి ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ–12 వంటి విటమిన్లు, పోషకాలను కలిపి ఆ పిండిని మళ్లీ బియ్యం పోలికతో కెర్నెల్స్‌గా మారుస్తారు. ప్రతీ క్వింటా బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలుపుతారు.

ఈ బియ్యం మేలు చేస్తాయి..



ఫోర్టిఫైడ్ రైస్ తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా ఎంతో మేలు. ఈనెల 5 నుంచి జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సాధారణ బియ్యంతో కలిపి వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయిస్తాం. ఈ బియ్యం పంపిణీకి రెండో విడతలో జిల్లా ఎంపికైంది. ఈ అంశంపై బంధించి అధికారులు, మిల్లర్లకు అవగాహన కల్పించాం.

– ఎన్.మధుసూదన్, అదనపు కలెక్టర్

న్యూస్‌రీల్

5న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి అండర్–20 అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. 2004–2005 మధ్యలో జన్మించిన వారు పోటీలకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. ఈసందర్భంగా 15, 16వ తేదీల్లో వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుతో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో 5వ తేదీన ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ఫంక్షన్ హాల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్, ఫైర్ ఆఫీసర్

ఖమ్మంమయూరిసెంటర్: నగర పరిధిలో ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాల్స్ యజమానులు మున్సిపల్ యాక్ట్ ప్రకారం నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. నగరంలోని పలు ఫంక్షన్ హాళ్లు, మార్ట్‌లను శనివారం తనిఖీ చేసిన ఆయన ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలుపై ఆరా తీశారు. కొన్నిచోట్ల మంటలు ఆర్పే సిలిండర్ల గడువు తీరడంతో కొత్తవి సమకూర్చుకోవాలని సూచించారు.అలాగే, అత్యవసర ద్వారాల ఏర్పాటు, ఇతర సౌకర్యాలపై కమిషనర్ సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర రావు, డీసీపీ వికాస్, ఏసీపీ సాయిరాం, టీపీఎస్‌లు నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి పాదానికి అభిషేకం చేశాక.. స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, శ్రీవారికి పల్లకీ సేవ చేయగా, పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈఓ జగన్మోహన్ రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల్లో రికార్డ్!

- వైరా డిపో నుంచి ఒకేరోజు రూ.28.80 కోట్ల అమ్మకం



వైరా: వైరాలోని ఐఎంఎల్ డిపో ద్వారా మద్యం అమ్మకాల్లో రికార్డు నమోదైంది. ఇక్కడి నుంచి ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం సరఫరా అవుతుండగా, మునుపెన్నడూ లేని విధంగా శుక్రవారం ఒకే రోజు రూ.28.80 కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. ఇందులో 39,100 కేసుల మద్యం, 13,600 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గతంలో ఓ రోజు రూ.24 కోట్లకు పైగా అమ్మకాలు జరగగా, ఇప్పుడు ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఇక తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తంగా రూ.2,029 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. ఆర్థిక సంవత్సరం శుక్రవారంతో ముగియడమే కాక, శనివారం బ్యాంకులకు సెలవు, ఆతర్వాత ఆదివారం సాధారణ సెలవు కావడంతో మద్యం వ్యాపారులు భారీగా మద్యం డంప్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆశలు నేలరాలాయి..



కల్లూరు : ఎర్రబోయినపల్లిలో నేల రాలిన వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ

- గాలిదుమారంతో మామిడి రైతులకు తీరనినష్టం
- జిల్లాలో 3,564 ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- వరి, నిమ్మ, అరటి, మునగ పంటలపై కూడా దెబ్బ



వేంసూరు : చౌడవరంలో గాలివానకు విరిగిన మామిడి కొమ్మల వద్ద రైతు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అకాల వర్షాలు రైతుల ఆశలను అడియాసలు చేస్తున్నాయి. గత నెలలో కురిసిన వర్షంతో మొక్కజొన్న రైతులు నష్టపోగా.. శుక్ర, శనివారాల్లో వచ్చిన గాలిదుమారం, వర్షంతో మామిడి రైతు విలవిల్లాడుతున్నాడు. మరో పదిహేను రోజుల్లో కాయలు చేతికొస్తాయనగా గాలిదుమారానికి నేలరాలాయి. ఈదురుగాలులతో కూడిన ఈ వర్షాలకు జిల్లాలోని దాదాపు 941 మంది రైతులకు చెందిన 3,564 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అలాగే ఇతర ఉద్యాన పంటలు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయి.

మామిడికి జిల్లా ప్రసిద్ధి..

జిల్లాలో మామిడితోటలు అత్యధికంగా ఉన్నాయి. ఇక్కడ పండే మామిడి పండ్లకు దేశ, విదేశాల్లో పేరుంది జిల్లాలోని సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, ఏన్కూరు, తల్లాడ, కొణిజర్ల, మధిర, బోనకల్, చింతకాని తదితర మండలాల్లో మామిడి తోటలు ఉన్నాయి. కాగా, వేసవి తొలిదశలో వచ్చే గాలిదుమారాలతో పూత రాలిపోతుంటుంది. కానీ ప్రస్తుతం కొన్నిచోట్ల కాయలు వారం నుంచి 15 రోజుల్లో విక్రయానికి సిద్ధమవుతాయని భావిస్తుండగా గాలిదుమారంతో నేలరాలాయి. ఈమేరకు దెబ్బతిన్న మామిడి తోటలను శనివారం ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. దీంతో 941 మంది రైతులకు చెందిన 3,564 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినా.. నష్టం అంతకంటే ఎక్కువే ఉంటుందని రైతులు చెబుతున్నారు. అత్యధికంగా పెనుబల్లి మండలంలో 381 మంది రైతులకు చెందిన 1,525 ఎకరాల్లో మామిడి దెబ్బతిన్నట్లు అంచనా.

ఇతర పంటలకూ నష్టం..

గాలిదుమారంతో మామిడిపంటతోపాటు అరటి, నిమ్మ, మునగ వంటి ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఈ పంటలను కూడా ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. ఇరవై రైతులకు చెందిన ఈ పంటలు 62 ఎకరాల్లో దెబ్బతినగా, రూ.16 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. మధిర మండలంలో ఇద్దరు రైతులకు చెందిన మునగ పంట ఐదు ఎకరాల్లో దెబ్బతిన్నది. అలాగే ఎర్రుపాలెం మండలంలోనూ నష్టం జరిగింది. వేంసూరు మండలంలో ఒక రైతుకు చెందిన మూడు ఎకరాల్లో నిమ్మ పంట దెబ్బతినగా.. వైరా, ఎర్రుపాలెం, మధిర తదితర మండలాల్లోనూ నష్టం కనిపించింది. కాగా, సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో ఎమ్మెల్యే వెంకటవీరయ్య, వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు విజయనిర్మల, అనసూయతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.


దెబ్బతిన్న పంటల ప్రాథమిక అంచనా..

నష్టపోయిన పంటలు	3,626 ఎకరాలు
రైతులు	961 మంది
నష్టం	రూ.14.78 కోట్లు

మామిడి పంట అత్యధికంగా దెబ్బతిన్న మండలాలు

మండలం	రైతులు	ఎకరాలు
పెనుబల్లి	381	1,525
వేంసూరు	196	785
కల్లూరు	64	256
సత్తుపల్లి	45	168
ఏన్కూరు	15	70

మూడు టన్నుల కాయ రాలింది..



పదహారు ఎకరాల మామిడి తోట ఉండగా.. ఈ ఏడాది సాగు ఖర్చులకు రూ.5 లక్షల వరకు వెచ్చించా. ప్రస్తుతం టన్ను ధర రూ.30 వేలు ఉండడంతో ఇటీవలే రూ.18 లక్షలకు తోట కొనడానికి వ్యాపారులు వచ్చారు. ఇంతలోనే గాలిదుమారానికి మూడు టన్నులకు పైగా కాయలు నేలరాలాయి. గతేడాది ఇలాగే జరగగా పరిహారం ఏమీ రాలేదు. మార్కెట్‌లో మంచి ధర వస్తేనే గట్టెక్కుతాం.

– లగడపాటి శ్రీనివాసరావు, రైతు, ఎల్.ఎస్.బంజర, పెనుబల్లి మండలం

ఎస్సెస్సీ.. జీ రెడీ!

- రేపటి నుంచి వార్షిక పరీక్షలు
- జిల్లాలో హాజరుకానున్న 16,873మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం



ఏన్కూరు : జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 103 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 16,873మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు జరగనుండగా, ఫస్ట్ లాంగ్వేజ్, కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్షలు మాత్రం మధ్యాహ్నం 12–50గంటల జరుగుతాయి. కాగా, కేంద్రాల్లోకి విద్యార్థులను ఉదయం 8–30గంటల నుంచే అనుమతిస్తారు.

పకడ్బందీగా నిర్వహించేలా..

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 103మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 105మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల నిమించారు. అలాగే, 87 మంది సిట్టింగ్ స్క్వాడ్, 1,020 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. కాగా, వేసవి దృష్ట్యా అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. అలాగే, దూరప్రాంత విద్యార్థులకు రవాణా సౌకర్యం కూడా ఏర్పాటుచేశారు. ఇక పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా బాధ్యతలను గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేస్తారు.

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

గతంలో పాఠశాలల నుంచే హాల్‌టికెట్లు తీసుకుని విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి వచ్చేది. అయితే, కొన్నిప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫీజుల పేరిట ఇబ్బంది పెడుతుండడంతో విద్యాశాఖ నేరుగా వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు పొందుపర్చింది. ఈమేరకు విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు.

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేశాం. అన్ని కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించడమే కాక వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ కూడా అమల్లో ఉంటుంది. విద్యార్థులు నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకుని పరీక్ష ప్రశాంతంగా రాయాలి.

– సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

గొర్రెల పంపిణీ కట్టుదిట్టంగా అమలు చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకం రెండో విడత కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. హైదరాబాద్ నుండి శనివారం ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి రెండో విడత గొర్రెల పంపిణీ, కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, పోడుభూములకు పట్టాల అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో పాటు రవాణాకు టెండర్లు పిలవాలని తెలిపారు. ఆతర్వాత సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ కంటివెలుగులో పరీక్ష చేయించుకున్న వారికి అవసరమైతే ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలని, ఆరోగ్య మహిళ కేంద్రాల్లో పరీక్షలు చేయించుకునే అవగాహన కల్పించాలని సూచించారు. ఇక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జారీ చేసిన 58, 59, 76, 118జీఓలపై పురోగతిపై ఆరా తీసిన ఆమె పలు సూచనలు చేశారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో శిరీష, పశు సంవర్ధక శాఖ జేడీ వేణుమనోహర్, డీఎంహెచ్ఓ బి.మాలతి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా వ్యవహరించాలి

ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఉద్యోగులు జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఇటీవల జిల్లాకు చేరిన 2,197 వీవీ ప్యాట్లను జెడ్పీ ఆవరణలోని ఈవీఎం గోదాంలో భద్రపర్చగా ఆయన పరిశీలించి మాట్లాడారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, ఎన్నికల పర్యవేక్షకులు రాంబాబుతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు అబ్దుల్ రంజాన్ జి.విద్యాసాగర్, ఆర్.ప్రకాష్, ఎస్.కే.తాజుద్దీన్, మర్రి శ్రీనివాస్, ఎన్‌రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

నేడు రామయ్యకు తెప్పోత్సవం, దొంగల దోపు ఉత్సవం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి శనివారం రథోత్సవంలో విహరించారు. స్వామి వారికి పట్టాభిషేకం జరిగిన రోజునే రథోత్సవం జరపడం భద్రాచల దివ్యక్షేత్రంలో ఆనవాయితీ. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవగా రథోత్సవాన్ని శనివారం నిర్వహించారు. జరిపారు. స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, రథంపై ఉంచి ఆలయం నుంచి తాతగుడి వరకు ఊరేగింపు జరిపారు. దారి పొడువునా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తరించారు. రథోత్సవంలో శ్రీ రాముని సేవించిన వారికి ముక్తి లభిస్తుందని స్థల పురాణం చెబుతుందంటూ అర్చకులు వివరించారు.

రామయ్యకు పండితుల మహదాశీర్వచనం

వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పండితులు రామయ్య స్వామికి మహదాశీర్వచనం అందచేశారు. కల్యాణం జరిగిన మూడో రోజున స్వామి వారికి మహదాశీర్వచనం అందజేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని వేద పండితులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని బేడా మండపంలో కొలువుదీర్చి పూలు, పండ్లు సమర్పించి పూజలు చేశారు. కాగా ఆదివారం తెప్పోత్సవం, దొంగల దోపు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈఓ ఎల్.రమాదేవి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, స్థానాచార్యులు కేఈ స్థల శాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్ పాల్గొన్నారు.



స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఈఓ రమాదేవి, అర్చకులు, ఉద్యోగులు



మహదాశీర్వచనం అందజేస్తున్న అర్చకులు, పండితులు

క్లుప్తంగా

నేడు జిల్లాలో ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. మధిర నియోజకవర్గంలోని ముదిగొండ, ఎర్రుపాలెంతో పాటు వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొంటారు. అలాగే, జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగే సమావేశాలకు కూడా ఎంపీ హాజరుకానున్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సండ్ర, తదితరులు

సత్తుపల్లి: సత్తుపల్లి 18వ వార్డు కౌన్సిలర్ ఎస్.కే.మౌలాలీ శనివారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందులలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ వనమా వాసు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్.కే.రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ సేవలు సద్వినియోగం చేసుకోండి

రఘునాథపాలెం: మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. రఘునాథపాలెంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులు, గ్రామ, మండల సమాఖ్యల బాధ్యులు ఆరోగ్య మహిళతో ప్రయోజనాలను అందరికీ వివరించాలని తెలిపారు. ఉచితంగా పరీక్షలు, చికిత్స, మందులు అందుతాయని చెప్పారు. జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, ఎంపీడీఓ రామకృష్ణ, ఐకేపీ ఎంపీఎం శారద తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్లతో జాగ్రత్త

ఖమ్మం సహకారనగర్: విద్యుత్ హైటెన్షన్ తీగలతో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. ట్రాన్స్‌కో ద్వారా ఖమ్మం నుండి ఆర్టీఎస్ఎస్(సీతారాంపట్నం) వరకు 132 కేవీ లైన్‌ను 1976లో ఏర్పాటు చేయగా.. సమీప ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యాన టవర్ నుండి ఇరువైపులా కనీస దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు.

వాకింగ్ చేస్తున్న మహిళ గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం గొలుసు చోరీ జరిగింది. బ్యాంక్‌కాలనీకి చెందిన ఏపూరి కోటేశ్వరి రోజులాగే సాయంత్రం వాకింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆమె పడిపోతుండగా మెడలోని 45గ్రాముల బంగారు గొలుసు లాక్కుని ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లిపోయాడు. వెంటనే తేరుకున్న ఆమె కేకలు వేయగా స్థానికులు చేరుకుని ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీ డ్రైవర్‌ను ఢీకొట్టి వాహనం బోల్తా

కొణిజర్ల: రోడ్డు పక్కన లారీ నిలిపి ముఖం కడుక్కుంటున్న డ్రైవర్‌ను టాటా మేజిక్ వాహనం ఢీకొట్టి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కొణిజర్ల ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా పెద్దవేగి మండలం వేగువాకకు చెందిన డ్రైవర్ తమ్మిశెట్టి వెంకన్న శనివారం కొణిజర్ల ఎన్నెస్పీ సాగర్ కాల్వ సమీపాన లారీ నిలిపి ముఖం కడుక్కుంటున్నాడు. ఈక్రమంలో తల్లాడకు చెందిన గద్దె ఉమామహేశ్వరరావు టాటా మేజిక్‌లో కూరగాయల లోడ్‌తో వెళ్తూ వెంకన్నను ఢీకొట్టాక పల్టీ కొట్టింది. ఈఘటనలో వెంకన్న కాలు నుజ్జునుజ్జు కాగా, క్షతగాత్రుడిని ఖమ్మం తరలించారు. ఆయన బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్సును దహనం చేసిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు ఓ ప్రైవేట్ బస్సును దహనం చేశారు. నారాయణ్‌పూర్ నుంచి దంతెవాడకు సుమారు 30 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రిబస్సు వెళ్తోంది. ఈ క్రమంలో దంతెవాడ జిల్లా మాలేవాహి – బొడ్లీ మధ్య బస్సును ఆపిన మావోయిస్టులు ప్రయాణికులు, సిబ్బందిని కిందకు దించాక డీజిల్ ట్యాంక్ బద్దలు కొట్టి నిప్పంటించారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. అనంతరం ప్రయాణికులు, సిబ్బంది సమీపంలోని బొడ్లీకి చేరుకోగా శనివారం ఉదయం పోలీసులు ప్రత్యేక వాహనాల్లో గమ్యస్థానాలకు పంపించారు. ఈ ఘటనలో సుమారు 25 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లుగా ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది.

ముగిసిన జాతీయ స్థాయి పోటీలు

- హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన, మహిళల కబడ్డీ
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ





పోటీలను తిలకిస్తున్న ఎంపీలు నామ, వద్దిరాజు, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధు, (ఇన్‌సెట్) బండ లాగుతున్న ఎద్దులు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో ఇంటూరి శేఖర్ యువసేన ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన జాతీయస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు, జాతీయ స్థాయి మహిళల ప్రో కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతు సమన్వయసమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, ఏటా పోటీలు నిర్వహిస్తున్న ఇంటూరి శేఖర్‌ను అభినందించారు. కాగా, చివరి రోజు సీనియర్స్ విభాగం ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురి ఎడ్లు పోటీపడ్డాయి. అలాగే, మహిళల ప్రో కబడ్డీ సెమీ ఫైనల్స్, ఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి క్రీడాకారులు, ప్రజలు హాజరు కాగా.. నిర్వాహకులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

'న్యూ విజన్' వార్షికోత్సవంలో డీఈఓ సోమశేఖరశర్మ



వేడుకలను ప్రారంభిస్తున్న డీఈఓ శర్మ, చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం స్పోర్ట్స్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమేనని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ అన్నారు. నగరంలోని న్యూవిజన్ పాఠశాల వార్షిక క్రీడోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ బాల్యంలో నేర్చుకున్న ఏ అంశమైనా మనస్సులో నాటుకుపోతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణం అలవడుతుందని తెలిపారు. అంతేకాకుండా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని చెప్పారు. అనంతరం న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రైమరీ, హైస్కూల్, ఫౌండేషన్ విభాగాల్లో విద్యార్థులకు విడతల వారీగా ఏటా ఆటల పోటీలు నిర్వహిస్తూ అందరూ పాల్గొనేలా చూస్తామని తెలిపారు. తమ విద్యార్థులు పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు పొందారని చెప్పారు. ఈకార్యక్రమంలో న్యూవిజన్ విద్యాసంస్థల డైరెక్టర్లు సీహెచ్.కార్తీక్, సీహెచ్.గోపీచంద్, ప్రిన్సిపాల్ ఎం.డీ.అబాద్ అలీ, మైఖేల్, సీహెచ్.మాధవి, శ్రీలేఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళా మేళా ప్రారంభం



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మేయర్ నీరజ, చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం బైపాస్ రోడ్డులోని దోరేపల్లి ఫంక్షన్ హాల్‌లో శ్రీ కళాభారతి చేనేత హస్తకళా మేళాను మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు చేయూతనివ్వాలని కోరారు. ఈనెల 18వ తేదీ వరకు మేళా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

రూ.7వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఖమ్మంరూరల్: మండలంలోని సాయినగర్‌కు చెందిన విద్యార్థి ఎండీ.అబ్దుల్ మజీద్ నుండి శనివారం సైబర్ నేరగాళ్లు రూ.7వేలు కొట్టేశారు. ఓ వ్యక్తి నుంచి విద్యార్థికి తెలిసిన ట్రెయినర్ నంబర్‌ను హ్యాక్ చేసి ఆ నంబర్ ద్వారా రూ.7వేలు పంపించాలని ఇన్‌స్టా మెసేజ్ చేశాడు. దీంతో మజీద్ రూ.7వేలు పంపించాక మరో రూ.3వేలు కావాలని అడగడంతో ట్రెయినర్‌కు ఫోన్ చేసి అడగగా తాను అడగలేదనడంతో మోసపోయినట్లు గుర్తించాడు. ఈమేరకు మజీద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

అటు ఆట... ఇటు బెట్టింగ్ పాట!

ఐపీఎల్‌తో పాటే మొదలైన పందేలు

- కాయ్ రాజా కాయ్ అంటూ పోటాపోటీ
- రూ.వేలు దాటి రూ.లక్షలకు చేరుతున్న వైనం
- గతంలో జిల్లాలో పట్టుబడిన పలువురు



పాల్వంచ రూరల్: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) టీ 20 క్రికెట్ 16వ సీజన్ మొదలైంది. రెండు నెలలపాటు జరగనున్న 74 మ్యాచ్‌ల్లో మొదటి మ్యాచ్ శుక్రవారం జరిగింది. క్రికెట్ అభిమానులు తాము మెచ్చే జట్ల నడుమ మ్యాచ్‌లను ఆసక్తిగా చూస్తూ గెలవాలని కోరుకుంటుండగా.. మరోపక్క బెట్టింగ్ రాయుళ్లు సైతం రంగంలోకి దిగారు. గతంలో తమ వద్ద పందేం కాసిన వారే కాకుండా కొత్త వారినీ ఆకట్టుకుంటూ రూ.వేలు దాటి రూ.లక్షల్లో బెట్టింగ్‌కు పాల్పడుతుండగా అమాయకులు వారి ఉచ్చులో చిక్కుకుని మోసపోయే ప్రమాదముంది.

అప్పులు చేసి మరీ...

పాల్వంచలో ఓ యువకుడు పెళ్లికి వచ్చిన వరకట్నం డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడు. దీంతో భార్యాభర్తలు విడిపోయే పరిస్థితి ఎదురైంది. విద్యార్థులు సెల్‌ఫోన్‌ల ద్వారా రూ.వేలల్లో లోన్లు తీసుకుని బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులపాలై ఇళ్లు వదిలి వెళ్లిన ఉదంతాలు ఉన్నాయి. ఇలా ప్రతీ ఐపీఎల్ సీజన్‌లో అనేక మంది రోజుంతా కష్టపడి సంపాదించిన మొత్తాన్ని క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయిన వారు ఉన్నారు. గతంలో పోలీసులకు పట్టుబడిన వారే మళ్లీ ఈసారి సైతం అదే బాట ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం అంత సెల్‌ఫోన్ల ద్వారానే కొనసాగుతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందుకు ఒక జట్టుపై రూ.వెయ్యి బెట్టింగ్ కాసి ఆ జట్టు గెలుపొందితే రెండింతల డబ్బు మరునాడు అకౌంట్‌లో జమ చేస్తారు. అయితే, ఒకరిద్దరి మాత్రమే డబ్బు ఇస్తుండగా ఎక్కువ మంది డబ్బు కోల్పోతారని తెలుస్తోంది.

బాల్ టూ బాల్ బెట్టింగ్‌లు

ఐపీఎల్ సీజన్‌లో ఏ రోజుకా రోజు మ్యాచ్ ప్రారంభం కాగానే బెట్టింగ్ మొదలుపెడతారు. మ్యాచ్ విజయావకాశాలే కాకుండా ఏ ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి, ఏ బాల్ సిక్స్ కొడతారు... ఇలా ఏ అంశాన్ని కూడా వదలకుండా పందెం కాస్తూ యువకులు ఉచ్చులో చిక్కుకునేలా చూస్తారు. ఈక్రమంలో పలువురు అత్యాశకు పోయి రూ.లక్షల్లో డబ్బు నష్టపోతుంటారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు వంటి ప్రాంతాల్లో బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగుతుందనే ప్రచారం సాగుతోంది. గతంలో పాల్వంచ మండలం నాగారంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇల్లెందు ఏరియాలో ఎనిమిది మందిపై, రుద్రంపూర్ ఏరియాలో ఐదుగురిపై, రామవరంలో ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి బెట్టింగ్ ఉచ్చులో ఎవరూ నష్టపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు సరికాదు..

ఐఎఫ్‌టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి జనార్దన్



ఐఎఫ్‌టీయూలో చేరిన వారితో జనార్దన్ తదితరులు

ఖమ్మంఅర్బన్: కార్మికులకు నష్టం కలిగించేలా పాలకులు వ్యవహరించడం సరికాదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ డిమాండ్ చేశారు. నగరంలోని బల్లేపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ సంఘం ఐఎఫ్‌టీయూలో పలు కుటుంబాలు శనివారం చేరగా.. ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం 49 చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొస్తోందని ఆరోపించారు. తద్వారా కార్మికులకు జరగనున్నందున నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే, అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తూ ప్రమాదవశాస్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షలు, సాధారణ మృతికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు వివాహం, గర్భిణులకు రూ.లక్ష చొప్పున కేటాయించాలని, లేబర్ కార్డు కలిగిన 60 ఏళ్లు దాటిన వారికి రూ.6వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు షేక్ సబాహన్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు గంట నాగయ్య, గోపాల్‌రావు, నాగన్న, మందుల రాజేంద్రప్రసాద్, పొట్లపల్లి విప్లవకుమార్, బజ్జూరి వెంకట్రాంరెడ్డి, షేక్ ఖాసిం, వెంకన్న, కోలా లక్ష్మీనారాయణ, పరకాల లక్ష్మి పాల్గొనగా, ఐఎఫ్‌టీయూలో చేరిన వారిలో గుగులోత్ పటేల్, బోడ నాగేశ్వరరావు, నర్రా ఉపేందర్ తదితరులు ఉన్నారు.

కార్మికవర్గ విచ్ఛిన్నం సరికాదు..

ఖమ్మంమయూరిసెంటర్: న్యూడెమోక్రసీ అనుబంధ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూలోకి చేరిన గుగులోత్ పటేల్, బోడ నాగేశ్వరరావుకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ, తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘంతో ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘాల బాధ్యులు కె.శ్రీనివాస్, పేరబోయిన వెంకన్న, గోస్ పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అయినప్పటికీ తమ సభ్యులుగా చెబుతూ న్యూడెమోక్రసీ ఐఫ్‌టీయూలో చేరినట్లు ప్రకటించడం కార్మికవర్గ వ్యతిరేక, విచ్ఛిన్నకర చర్యలేనని.. వీటిని విడనాడాలని సూచించారు.

జాతీయ రహదారి పనులు అడ్డగింత



నిరసనలో పాల్గొన్న రైతులు

ముదిగొండ: కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణంలోభాగంగా వెంకటాపురం–ముదిగొండ నడుమ జరుగుతున్న పనులను స్థానిక రైతులు శనివారం అడ్డుకున్నారు. తమ పొలాలకు వెళ్లేందుకు అండర్ పాస్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఆందోళనకు దిగారు. అండర్ పాస్ నిర్మించకపోతే తమ పొలాలకు వెళ్లే క్రమాన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు పెట్రోల్ బాటిళ్లతో నిరసన తెలిపారు.

పంటల సర్వే త్వరగా పూర్తిచేయాలి



సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

బోనకల్: ఇటీవల అకాల వర్షాలతో రైతులు నష్టపోయిన పంటల సర్వేను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు ఆదేశించారు. మండలంలోని తూటికుంట్లలో అధికారులు చేపట్టిన సర్వేను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని, నష్టపోయిన రైతులు సాగు చేసిన పంటలు, విస్తీర్ణం, బ్యాంకు అకౌంట్ వివరాలు సేకరించాలని తెలిపారు. ఏఓ అబ్బూరి శరత్‌బాబు, రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

వ్యాన్ – లారీ ఢీ

గంట పాటు నిలిచిపోయిన ట్రాఫిక్



రోడ్డు మధ్యలో నిలిచిన వ్యాన్, లారీ

తల్లాడ: తల్లాడ సమీపాన వైరా రోడ్డులో శనివారం రాత్రి వ్యాన్, లారీ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కల్లూరు నుండి సూర్యాపేట వెళ్తున్న మామిడి కాయల లోడ్ టాటా మ్యాజిక్ వ్యాన్ వే బ్రిడ్జి వద్ద కాంటా వేసుకొని రోడ్డెక్కుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్, కల్లూరు మండలం పుల్లయ్య బంజరకు చెందిన షేక్ షబ్బీర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు చేరుకుని రెండు జేసీబీల సాయంతో ఆయను బయటకు తీశారు. ఈ ఘటనలో దెబ్బతినడమే కాక రెండు వాహనాలు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో గంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుళ్లు బాలాజీ, కృష్ణ, లక్ష్మా, సుధాకర్ ఆధ్వర్యాన రాకపోకలు క్రమబద్ధీకరించారు.

లకారంలో దూకిన వ్యక్తి..

చికిత్స పొందుతూ మృతి

ఖమ్మంక్రైం: లకారం ట్యాంక్‌బండ్ వద్ద శనివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని బోట్ సిబ్బంది కాపాడారు. అయితే, ఆస్పత్రికి తరలించాక చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. ఖమ్మం వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. మమత రోడ్డుకు చెందిన వ్యాపారి తల్లాడ రమేష్ ట్యాంక్‌బండ్‌కు చేరుకుని బోట్ వద్దకు వెళ్లగా సిబ్బంది ఎక్కుతారా అని అడిగారు. ఇంకా వచ్చే వాళ్లు ఉన్నందున వెళ్లిపోవాలని సూచించిన ఆయన కాసేపటికి నీటిలో దూకాడు. దీంతో బోటు డ్రైవర్ పవన్ గుర్తించి నీటిలోకి దిగి రమేష్‌ను ఒడ్డుకు చేర్చాడు. అనంతరం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆయన కొంతకాలంగా నడుమునొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో రమేష్‌కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా రాత్రి మృతి చెందాడు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

సత్తుపల్లిరూరల్: చేపలు వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్సై సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన పలువురితో కలిసి రేగుల రాఘవులు(60) వేశ్యకాంత చెరువులో శనివారం చేపల వేటకు దిగాడు. అయితే రాఘవులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోగా, మిగతా వారు బయటకు వచ్చినా ఆయన రాలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చి గాలించగా మృతదేహం బయటపడింది. రాఘవులుకు భార్య ప్రభావతి, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

తలదాచుకునేందుకు వెళ్లి హతమై..

భద్రాద్రి జిల్లాలో గిరిజనుడి దారుణ హత్య



కన్నారావు మృతదేహం వద్ద తాళ్లతో కట్టేసిన కృష్ణ, కాంతమ్మ

చర్ల: వర్షం వస్తుండడంతో నీడ కోసం ఓ ఇంట్లోకి వెళ్లిన గిరిజనుడు దారుణ హత్యకు గురయ్యాడు. తలదాచుకునే చోటు ఇచ్చే విషయంలో ఘర్షణ జరిగిందా..? ఇతర కారణాలు ఉన్నాయా? అనేది తెలియరాలేదు. చర్ల మండలం పెదమిడిసిలేరుకు చెందిన బెండబోయిన కన్నారావు (43) శనివారం ఉదయం కట్టెల కోసం అడవికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గీసరెల్లి సమీపానికి రాగానే వర్షం మొదలవడంతో ఆ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న మునిగల కృష్ణ ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయాన ఇంట్లో ఒంటరిగా ఉన్న కృష్ణ.. కన్నారావుతో గొడవ పడి ఆయన చేతిలోని గొడ్డలి తీసుకుని నరికి చంపాడు. తరువాత మృతదేహాన్ని ఇంట్లో నుంచి తీసుకొచ్చి ఊరి బయట వేయడంతో విషయం బయటకు వచ్చింది. కాగా, హత్యకు పాల్పడిన కృష్ణ సైకోలా వ్యవహరిస్తుంటాడని, గతంలో ఇళ్లకు నిప్పంటించాడని, తరచుగా అందరితో గొడవ పడుతూ ఉంటాడని గ్రామస్తుల ద్వారా తెలిసింది. కన్నారావు మృతదేహాన్ని కృష్ణ తీసుకొచ్చే క్రమంలో గుర్తించిన గ్రామస్తులు ఆయనను కట్టివేసి దేహశుద్ధి చేశారు. అలాగే, హత్యతో కృష్ణ తల్లి కాంతమ్మకు కూడా సంబంధం ఉందంటూ కన్నారావు కుటుంబీకులు దేహశుద్ధి చేశారు. చర్ల పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

క్లుప్తంగా...

మామిడి రైతులకు 'అకాల' నష్టం



పెనుబల్లి మండలం కారాయిగూడెంలో మామిడి కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, అధికారులు

పెనుబల్లి/వేంసూరు: ఖమ్మం జిల్లా పెనుబల్లి, వేంసూరు తదితర మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుల వర్షానికి మామిడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పలుచోట్ల తోటల్లో కోతకు వచ్చిన మామిడికాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు విజయనిర్మల, అనసూర్య పర్యటించి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షానికి రైతులు నష్టపోగా.. సీఎం కేసీఆర్ పరిశీలించి పరిహారం ప్రకటించారని తెలిపారు. మళ్లీ రైతులు నష్టపోయిన నేపథ్యంలో సమస్యను వ్యవసాయ శాఖ మంత్రితో పాటు సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం వేంసూరు మండలంలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు.

దివ్యదర్శనం టోకెన్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమల నడకమార్గాల్లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టీటీడీ శనివారం ఉదయం నుంచి పునః ప్రారంభించింది. కోవిడ్ నేపథ్యంలో మూడు సంవత్సరాలుగా టీటీడీ దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేసింది. అయితే భక్తుల కోరిక మేరకు అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం వద్ద 10 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో ఐదు వేల దివ్యదర్శనం టోకెన్లను శనివారం నుంచి కేటాయిస్తున్నారు. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టోకెన్లు జారీ చేస్తారు. కాగా, శ్రీవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 4న అష్టదళ పాదపద్మారాధన, 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

వైద్య విద్య మరింత ఖరీదు?

- యూజీ, పీజీ మెడికల్, పారామెడికల్ కోర్సుల ఫీజు పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ కసరత్తు
- ఈ నెల 30లోగా కాలేజీల వారీగా ప్రతిపాదనలు కోరిన కమిటీ
- ఆదాయ, వ్యయాల ఆడిట్ రిపోర్టులు కూడా ఇవ్వాలని ఆదేశం
- వాటిని పరిశీలించాక ప్రభుత్వానికి నివేదిక
- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే అమల్లోకి కొత్త ఫీజులు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్య మరింత ఖరీదు కాబోతోంది. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు భారీగా ఉండగా, మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు అటు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తూనే.. ఇటు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ)కి సైతం విజ్ఞప్తులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023–24 నుంచి 2025–26 మధ్య కాలానికి సంబంధించి ఫీజుల నిర్ధారణపై కసరత్తు మొదలుపెట్టిన టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30వ తేదీలోగా మెడికల్ కాలేజీల వారీగా ప్రస్తుతం ఫీజులు, పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించింది.

కేటగిరీల వారీగా ఫీజులు

మెడికల్ కోర్సులకు సంబంధించి ఫీజులు ఒక్కో కేటగిరీలో ఒక్కో రకంగా ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో స్థిరమైన ఫీజులుండగా.. ప్రైవేటు కాలేజీల్లో మాత్రం ఏ, బీ, సీ కేటగిరీల్లో భిన్నమైన ఫీజులు తీసుకుంటున్నారు. ప్రైవేటు కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి కేటగిరీ 'ఏ' (కన్వీనర్ కోటా) అడ్మిషన్‌కు వార్షిక ఫీజు రూ.60వేలు ఉండగా.. కేటగిరీ 'బీ' (మేనేజ్‌మెంట్ కోటా)కి రూ.11.5 లక్షల నుంచి రూ.14.5 లక్షల వరకు ఉంది. ఇక కేటగిరీ 'సీ' (ఎన్నారై కోటా) అడ్మిషన్ ఫీజు రూ.25 లక్షల నుంచి రూ.28 లక్షల వరకు ఉంది. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కేటగిరీ 'ఏ'కు రూ.7.5 లక్షలు, కేటగిరీ 'బీ'కి రూ.28 లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఫీజు ఉంది. బీడీఎస్ కోర్సులకు కేటగిరీ 'ఏ'లో రూ.45 వేలు, కేటగిరీ 'బీ'లో రూ.4.2 లక్షలు ఉండగా.. కేటగిరీ 'సీ'లో రూ.ఎనిమిదిన్నర లక్షల వరకు ఉంది. వీటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీల వారీగా భిన్నంగా ఉన్నాయి.

ఆడిట్ రిపోర్టులే కీలకం

యూజీ, పీజీ మెడికల్ కోర్సుల ఫీజు పెంపునకు కాలేజీల ఆడిట్ రిపోర్టులే కీలకం కానున్నాయి. టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా ప్రతి కాలేజీ ఆడిట్ రిపోర్టును సమర్పించాలని సూచించింది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ, ఇతర వ్యయాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం ఉంటుంది. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒకరకంగా ఉంటే పట్టణ ప్రాంతాల కాలేజీల్లో మరోరకంగా ఉంటాయి. దీంతో కాలేజీ వారీగా ఆడిట్ నివేదికలను పరిశీలించాక ఫీజుల పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ ఒక అంచనాకు వస్తుంది. ఆ మేరకు ఫీజులను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం దానిని ఆమోదిస్తే కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి.

గద్వాలలో సరెండర్ లొల్లి!

- జెడ్పీ సీఈఓ విజయనాయక్ సరెండర్
- ప్రెస్‌మీట్ పెట్టి కలెక్టర్‌పై విమర్శలు
- ఫోన్ ద్వారా మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫిర్యాదు
- హాట్‌టాపిక్‌గా మారిన సరెండర్ వ్యవహారం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల జిల్లా పరిషత్ సీఈఓ విజయ నాయక్ సరెండర్..ఆ తర్వాత ఆమె కలెక్టర్ వల్లూరి క్రాంతిపై విమర్శలు గుప్పించడం హాట్‌టాపిక్‌గా మారింది. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి సీఈఓ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో అశ్రద్ధ వహిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా పరిపాలనకు ఆటంకం కలిగిస్తున్నారంటూ విజయ నాయక్‌ను పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ గద్వాల కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రెస్‌మీట్ నుంచే మంత్రికి ఫోన్..

తనను కలెక్టర్ వల్లూరు క్రాంతి సరెండర్ చేసి అన్యాయం చేశారంటూ ప్రెస్‌మీట్ నుంచే జెడ్పీ సీఈఓ..మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేశారు. తనను అన్యాయంగా సరెండర్ చేశారని..ఈ ఉత్తర్వులను ఆపి న్యాయం చేయాలని కోరారు. తాను జిల్లాలో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నానని.. విధులు ఎలా నిర్వర్తిస్తున్నానో తన టూర్ డైరీని పరిశీలించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి.. పూర్తి వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. అయితే ఆమె ఆదివారం ఉదయం 10 గంటలకు ఫోన్ చేస్తానని చెప్పగా.. ఆయన సరేనని సమాధానమిచ్చారు. కాగా.. జెడ్పీ సీఈఓ గతంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతోంది. అదనపు కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగడం, మహిళా దినోత్సవం రోజు ఓ మహిళా అధికారితో గొడవపడటం వంటి ఘటనలు ఉన్నాయని.. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో బాధితులను విజయ నాయక్ పట్టించుకోరనే ఫిర్యాదు కలెక్టర్‌కు చేరినట్లు తెలిసింది. దీంతో ఆమెపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు

సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. ముందుగా తిరుపతి నుంచి కువైట్‌కు విమాన సర్వీసులు ప్రారంభించేలా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, విమానయాన సంస్థలతో ఎంపీ గురుమూర్తి, ఎయిర్‌పోర్టు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. తిరుపతి నుంచి కువైట్‌కు సర్వీసులు నడపడానికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నుంచి సంకేతాలు వచ్చాయని తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్‌కిషోర్ చెప్పారు.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు హతం

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఘటన
- ఘటనాస్థలం వద్ద ఆయుధాలు, నగదు స్వాధీనం



ఎన్‌కౌంటర్ స్థలంలో లభించిన తుపాకులు, సామగ్రి

చింతలమానెపల్లి/కాళేశ్వరం: మహారాష్ట్రలోని ఏటపల్లి, భామ్రాగఢ్ సమీపంలో ఉన్న గట్ట అటవీప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు సమీర్ అలియాస్ సాధులింగ మొహందా (31) మృతిచెందాడు. గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ ఈ ఘటన వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు గడ్చిరోలి జిల్లా భామ్రాగఢ్ సమీపంలోని తొడగట్ట ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సీ60 యాంటీ నక్సల్స్ పోలీసు బృందం కమాండోలు గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీసులను గమనించిన సుమారు 60 నుంచి 70 మంది మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. సుమారు 45 నిమిషాలపాటు కాల్పులు జరిపిన మావోయిస్టులు అనంతరం అటవీప్రాంతంలో తప్పించుకుని పారిపోయారు. కాల్పుల అనంతరం గాలింపు నిర్వహించగా సమీర్ మృతదేహం లభించింది. మృతుడు భామ్రాగఢ్ తాలూకా తుమర్కోడి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా, ఘటనా స్థలంలో ఒక 303 రైఫిల్, నాటుతుపాకీ, బర్మార్ రైఫిల్, రెండు ఎస్ఎల్ఆర్ మేగజీన్లు, 30 రౌండ్ల బుల్లెట్లు, 8ఎంఎం రైఫిల్, రూ.38వేల నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మావోయిస్టు యూనిఫారాలు, విప్లవ సాహిత్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టులకోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. మృతిచెందిన మావోయిస్టుపై రూ. 2 లక్షల రివార్డు ఉంది. మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో గడ్చిరోలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెల దహనం

పోలీసు బందోబస్తు మధ్య తగులబెట్టిన రెవెన్యూ సిబ్బంది



గుడిసెలను కూల్చి కాల్చివేస్తున్న దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ స్థలంలో ఇళ్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య శనివారం తగులబెట్టారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామంలో ఇళ్లు లేని ఎస్సీ, బీసీ నిరుపేదలకు 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 180 మందికి, 2010లో కాంగ్రెస్ ప్రభుత్వం 40 మందికి మొత్తం 220 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. సర్వే నంబర్ 175తో పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలను చూపించక పోవడంతో ఏళ్ల తరబడి పేదలు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఆ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో రైతు వేదిక, విద్యుత్ ఉప కేంద్రం కార్యాలయాన్ని నిర్మించారు. మిగతా ప్రభుత్వ స్థలంలో నాలుగు నెలల క్రితం బాధితులు గుడిసెలు వేసుకున్నారు. తమకు న్యాయం చేయాలని, గతంలో ప్రభుత్వం అందజేసిన ఇళ్ల పట్టాలతో బాధితులు తహసీల్దార్, ఆర్డీఓతో పాటు ఎమ్మెల్సీ కడియం, ఎమ్మెల్యే రాజయ్యకు వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ ఎవరూ స్పందించకపోగా నాలుగు నెలల్లో రెవెన్యూ సిబ్బంది పలుమార్లు గుడిసెలు తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎన్నిమార్లు హెచ్చరించినా బాధితులు వినకపోవడంతో శనివారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తుతో వచ్చి పేదలు వేసిన గుడిసెలను జేసీబీతో తొలగించి తగులబెట్టారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకునే సరికి గుడిసెలు మొత్తం కాలిబూడిదయ్యాయి. ఈ ప్రభుత్వ స్థలాన్ని ఫైర్ స్టేషన్ కోసం, పలు ప్రభుత్వ అవసరాల కోసం ఈ కేటాయించామని తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

జిల్లా వార్తలు


కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన షేక్ నాజీమా తండ్రి లాలా మహమ్మద్ కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా నండ్రు ప్రమోద్ ఆధ్వర్యాన సేకరించిన రూ.35,200 నగదును శనివారం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు ఎస్.కే.చాంద్‌పాషా, నడ్డి జమలమ్మ, తడికమళ్ల ప్రకాశరావు, నడ్డి ఆనందరావు, అద్దంకి అనిల్, రఘు, జిన్నీ, పూజల రవి, మదీనాపాషా, జాని, సాయిపూజిత, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థుల్లో మనోధైర్యం నింపండి




వీసీలో పాల్గొన్న పీఓ గౌతమ్, అధికారులు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఆశ్రమ, గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపి వార్షిక పరీక్షలు ధైర్యంగా రాసేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఆమె ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, గురుకులాల కార్యదర్శి సెక్రెటరీ రోనాల్డ్ రోస్, ఏడీ సర్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఐటీడీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలని, వారి వెంట ఓ ఉపాధ్యాయుడిని పంపాలని సూచించారు.అలాగే, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు, తాగునీరు, విద్యుత్‌సౌకర్యం, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. భద్రాచలం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ రమాదేవి, ఏసీఎంఓ రమణయ్య తదితరులు హాజరయ్యారు.

కళ్లారా చూడొచ్చు.. ఎదగొచ్చు!

- ఇస్రోలో శిక్షణకు విద్యార్థులకు అవకాశం
- 9వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- స్వీకరణకు రేపటితో ముగియనున్న గడువు



ఉపగ్రహ నమూనాను పరిశీలిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే కాక శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించి భావి శాస్త్రవేత్తలు ఎదిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందులో భాగంగానే వేసవి సెలవుల్లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాయి. అన్ని రాష్ట్రాల నుంచి ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి యువ విజ్ఞాని కార్యక్రమం(యువిక) పేరుతో శిక్షణ ఇస్తారు. దరఖాస్తు గడువు సోమవారంతో ముగియనుండగా.. ప్రతిభావంతులను శిక్షణకు ఎంపిక చేస్తారు.

ప్రతిభే ఆధారం

ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇస్రోలో శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అయితే, 8వ తరగతిలో మంచి మార్కులు సాధించడమే కాక గడిచిన మూడేళ్లలో ఒలింపియాడ్, సైన్స్ పోటీల్లో పాల్గొని ఏదైనా బహుమతి సాధించడం, 1నుంచి 3లోపు ర్యాంక్‌లు సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అలాగే, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లు, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రాధాన్యమిస్తారు. కాగా, జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 453 ఉండగా, ఇందులో 9వ తరగతి 18,490మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 9,697 మంది బాలురు, 8,793మంది బాలికలు ఉండగా.. ఇస్రో శిక్షణకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

దరఖాస్తు ఇలా...

ఇస్రోలో శిక్షణ కోసం విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తొలుత ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు పంపించాలి. ఆ తర్వాత 48గంటల్లోగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలో పాల్గొనాలి. క్విజ్ పూర్తయిన 60 నిమిషాల్లోగా యువిక పోర్టల్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. మొత్తం సమాచారంతో కూడిన దరఖాస్తు, సంతకం చేసిన ప్రతి, అవసరమైన ధృవపత్రాలతో అప్‌లోడ్ చేయాలి. సోమవారం లోగా ఇవన్నీ పూర్తిచేస్తే... ఎంపికైన వారి జాబితాను 10వ తేదీన ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం ఇస్తారు. శిక్షణకు వెళ్లే వారికి రవాణా ఖర్చులు సైతం ప్రభుత్వమే భరిస్తుంది.

శిక్షణ ఇక్కడే...

ఇస్రో అర్హత పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్‌తో పాటు శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్, తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్.రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎస్ఏసీ), హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ), షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎన్ఈ–ఎస్ఏసీ) శిక్షణ ఉంటుంది. మే 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చి, ఆతర్వాత శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరిశోధనలపై అవగాహన కల్పిస్తారు. తద్వారా విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొంది శాస్త్రవేత్తలుగా ఎదుగుతారనేది ప్రభుత్వ భావనగా చెబుతున్నారు.

రేపటి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు...



విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రో యువిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దరఖాస్తు చేసుకున్న వారిలో ప్రతిభావంతులను గుర్తించి శిక్షణకు ఎంపిక చేస్తారు. సోమవారం వరకు దరఖాస్తుకు అవకాశం ఉండగా, 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సైదులు, జిల్లా సైన్స్ అధికారి

'ధ్వజస్తంభం' ఘటనపై ఉన్నత స్థాయి విచారణ

ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి వరంగల్ స్క్వాడ్ డీఎఫ్ఓ



ఆలయం వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: ఆలయం వద్ద ప్రతిష్ఠించాల్సిన ధ్వజస్తంభం దుంగను అటవీ శాఖ అధికారులు నరికివేయగా.. గ్రామస్తులు అటవీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో పాటు దాడి చేసిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించగా వరంగల్ స్క్వాడ్ డీఎఫ్ఓ నాగభూషణం శనివారం విచారణ ప్రారంభించారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపాన పెదవాగు ప్రాజెక్ట్ కట్ట దిగువన నిర్మిస్తున్న శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో ధ్వజస్తంభం కోసం గ్రామస్తులు సమీప అటవీ ప్రాంతం నుంచి నార వేప దుంగను తీసుకురాగా, స్థానిక అటవీ సిబ్బంది దాన్ని రంపంతో ముక్కలు కోయించి తీసుకెళ్లారు. దీంతో గ్రామస్తులు, హిందూ సంఘాల నాయకులు శుక్రవారం రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించడంతోపాటు దాడి చేశారు. ఈ ఘటన రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశం కాగా, రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. దీంతో వరంగల్ స్క్వాడ్ డీఎఫ్ఓ ఆధ్వర్యాన డీఆర్ఓ, ఎఫ్ఆర్ఓతో కూడిన బృందం శనివారం గంగానమ్మ ఆలయాన్ని సందర్శించి ఘటనపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ధ్వజస్తంభం కోసం తీసుకొచ్చిన దుంగను ముక్కలుగా చేయడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం విచారణ బృందం అశ్వారావుపేటలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి వెళ్లి తాజాగా జరిగిన దాడి వివరాలు తెలుసుకున్నారు.

బొగ్గు ఉత్పత్తిలో సత్తుపల్లి టాప్

- రైల్వేలైన్‌తో రవాణా వేగవంతం
- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్



మాట్లాడుతున్న జీఎం రమేష్, పక్కన పీఓలు వెంకటాచారి, నర్సింహారావు

సత్తుపల్లి: సింగరేణి చరిత్రలోనే సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేశాయని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ వెల్లడించారు. సత్తుపల్లిలోని జీఎం కార్యాలయంలో జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావుతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలో తగ్గిన బొగ్గు ఉత్పత్తిని సత్తుపల్లి ఓసీలతో భర్తీ అవుతోందని చెప్పారు. జేవీఆర్ ఓసీ 100 లక్షల టన్నులు, కిష్టారం ఓసీ 20 లక్షల టన్నుల లక్ష్యాన్ని పూర్తిచేశాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది 154.55 లక్షల టన్నుల లక్ష్యం విధించినట్లు తెలిపారు. కాగా, బొగ్గు ఉత్పత్తి, రవాణాకు సహకరించిన ఉద్యోగులు, కార్మికులను సింగరేణి సీఎండీ, డైరెక్టర్లు అభినందించారని ఆయన చెప్పారు. కాగా, రూ.1200 కోట్లతో నిర్మించిన రైల్వే లైన్‌తో రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాక బొగ్గు రవాణాలో వేగం పెరిగిందని జీఎం రమేష్ తెలిపారు. గతంలో రోజుకు 600 ట్రిప్పులు బొగ్గును కొత్తగూడెంకు రవాణా చేయాల్సి వచ్చేదని, రైల్వేలైన్ ప్రారంభించాక ఒక్క ప్రమాదం కూడా నమోదు కాలేదని పేర్కొన్నారు.

దుమ్ము కంట్రోల్ చేస్తాం..

కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి వస్తున్న బొగ్గు దుమ్మును అరికట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు జీఎం రమేష్ తెలిపారు. నిత్యం నీటి సరఫరా కోసం ఇప్పటికే రెండు బోర్లు సీహెచ్‌పీ వద్ద వేయగా.. లక్ష గ్యాలెన్ల సంపును నిర్మిస్తున్నామని చెప్పారు. కాగా, కిష్టారంలో సేకరించిన 55 ఎకరాల భూమిలో సింగరేణి అధికారులకు 80 క్వార్టర్లతో పాటు జీఎం క్వార్టర్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. వచ్చేఏడాదికల్లా సత్తుపల్లిలో జీఎం కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభింస్తామని వివరించారు. ఇంకా సత్తుపల్లి–రేజర్ల రోడ్డుకు రూ.20 కోట్ల నిధులను ఆర్అండ్‌బీకి డిపాజిట్ చేశామని తెలిపారు.

ఇళ్ల మరమ్మతులు చేపడతాం

సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మత్తులు చేపడుతున్నామని, ఇప్పటికి దరఖాస్తు చేసుకున్న 120 ఇళ్లను మరమ్మత్తులు చేశామని జీఎం రమేష్ చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇంకా బాధితులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈసమావేశంలో సింగరేణి అధికారులు సూర్యనారాయణ, శ్యామ్యూల్ సుధాకర్, యోహాన్, బంగారి శ్రీనివాస్, పి.నర్సింహారావు, రామకృష్ణ, రమణారెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, లక్ష్మణ్‌మూర్తి, రమణారావు, దేవదాసు, సందీప్ పాల్గొన్నారు.

'బొమ్మ' విద్యార్థులకు పేటెంట్



పేటెంట్ పత్రాలతో ప్రొఫెసర్, విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బొమ్మ ఫార్మసీ కాలేజీ ఫార్మకాగ్నిసీ అండ్ ఫైటోకెమెస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌భాస్కర్‌రావు పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన ఫార్ములాకు పేటెంట్ లభించింది. బీ ఫార్మసీ మూడో సంవత్సరం విద్యార్థులు జస్వంత్‌కుమార్, మధు, మంజుల, శిల్ప, మానిక ఔషధ మొక్కలపై పరిశోధన చేసి నూతన ఫార్ములా కనుగొనగా, ప్రభుత్వం నుంచి పేటెంట్ లభించిందని విజయ్‌భాస్కర్‌రావు తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ఫార్ములాతో తయారుచేసే ఔషధం జుట్టు ఒత్తుగా పెరగడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్, విద్యార్థులను కాలేజీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సెక్రటరీ ఉదారు శ్రీధర్, డైరెక్టర్ మాధవి తదితరులు అభినందించారు.